క్లుప్తంగా

రంగాకు ఎంపీ బాలశౌరి నివాళి



నాగాయలంక: నాగాయలంకలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా విగ్రహాన్ని శనివారం బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి సందర్శించారు. కాపు నేతల ఆహ్వానం మేరకు వంగవీటి రంగా సెంటర్‌కు వచ్చిన ఎంపీ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం ఏర్పాటుకు ఎంపీ ఎంతగానో సహకరించారని మండల శ్రీ కనకదుర్గ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి), కమిటీ సభ్యులు, కాపు పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని ఘనంగా సన్మానించారు. కాపు పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు చేయించాలి

కె. కొత్తపాలెం(మోపిదేవి): రెండో పంటగా వేసిన అపరాలకు ఈ క్రాప్ నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారి హెబ్సిబా రాణి అన్నారు. కె. కొత్తపాలెంలో శనివారం ఈ క్రాప్ నమోదు చేశారు. ఆమె మాట్లాడుతూ పంటకు ఈ క్రాప్ నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. ఆర్‌బీకేలలో పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



నాగాయలంక: గ్రామంలోని 3వ వార్డుకు చెందిన చిట్టా మహేశ్వరరావు (62) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. అతని నేత్రాలను విజయవాడ తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. మృతుని కుమారులు మణికంఠ, లీలా వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా సాంబశివరావు స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

మహిళ గర్భసంచి నుంచి ఐదు కిలోల గడ్డ తొలగింపు



చల్లపల్లి: చల్లపల్లిలో వైద్యులు ఆపరేషన్ ద్వారా మహిళ గర్భసంచి నుంచి ఐదు కిలోల గడ్డను తొలగించారు. స్థానిక కీర్తి హాస్పిటల్‌లో రేపల్లెకు చెందిన నాలి రత్నకుమారి వైద్య పరీక్షలు చేయించుకోగా ఆమె గర్భసంచిలో ఐదు కిలోల గడ్డ పెరిగి ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ నల్లపనేని కీర్తి క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి గర్భసంచితో సహా గడ్డను తొలగించారు. డాక్టర్ కేశవ కృష్ణ, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సబ్బినేని భవానీ ప్రసాద్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

డీసీ కేటగిరీలో సుబ్రహ్మణ్యేశ్వరుని దేవస్థానం

మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం డీసీ కేటగిరీగా అప్‌గ్రేడ్ అయిందని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రిన్సిపల్ కార్యదర్శి కరికల వలవన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు

బంటుమిల్లి: జిల్లాలో కరోనా కేసులు నమోదైన నేపథ్యంలో పంచాయతీ అధికారులు పెద్ద ఎత్తున శానిటేషన్ చర్యలు చేపట్టారు. శనివారం సర్పంచ్ వి. కృష్ణవేణి, ఈఓపీఆర్డీ త్రిపురసుందరి పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది వీధులను శుభ్రం చేసి పెద్దఎత్తున సున్నం, బ్లీచింగ్ చల్లారు. వారు మాట్లాడుతూ ప్రజలు కరోనా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్క్‌లు ధరించాలని సూచించారు. ఈఓ దాసరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న క్రీడాకారులు

- ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు
- హోరాహోరీగా సాగుతున్న పోటీలు



బందరులో ఖోఖో ఆడుతున్న క్రీడాకారిణిలు



కాకర్లమూడిలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వివిధ క్రీడల్లో క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. మచిలీపట్నం నగరంలో శనివారం షటిల్ బాడ్మింటన్, ఖోఖో ఆటల పోటీలు నిర్వహించారు. 35 నుంచి 50వ డివిజన్ వరకు ఉన్న క్రీడాకారులు షటిల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. 48 టీమ్‌లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో 96 మంది క్రీడాకారులు ప్రతిభ చాటారు. స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఖోఖో పోటీలకు ఎనిమిది టీమ్‌లు హాజరయ్యాయి. ఈ పోటీల్లో 96 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

- **బంటుమిల్లి:** మండల పరిధిలోని సచివాలయ స్థాయిలో శనివారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలబాలికలు, యువతీ యువకుల జట్లు పోటీపోటీగా క్రికెట్ ఆడారు. పీడీ మోహనరావు ఆధ్వర్యంలో ఈ పోటీలను సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పర్యవేక్షించారు.
- **పెడన:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా పెడన అర్బన్‌కు సంబంధించి బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ పోటీలు, పల్లోటి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఖోఖో పోటీలు శనివారం నిర్వహించారు. మండల పరిధిలోని కాకర్లమూడి సచివాలయం పరిధిలో బ్యాడ్మింటన్ (షటిల్) పోటీలు హోరాహోరీగా సాగాయి. సచివాలయ స్థాయిలో గెలుపొందిన వారికి మండల స్థాయిలో నిర్వహించేందుకు ఆయా పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు సన్నాహాలు చేస్తున్నారు.
- **నాగాయలంక:** నాగాయలంక, తలగడదీవి, ఏటిమొగ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారం కొనసాగాయి. ఆదివారం నుంచి భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజీ గ్రౌండ్స్‌లో క్రికెట్ పోటీలకు సన్నాహాలు ప్రారంభించామని ఎంపీడీఓ తెలిపారు. ఈమేరకు నాగాయలంక ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో ఎంపికైన క్రీడాకారులకు ఫిజికల్ డైరెక్టర్‌లు పోటీలపై అవగాహన కల్పించారు. గ్రామ స్థాయి క్రీడల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారులు 608 మంది నమోదు కాగా 38 జట్లుగా పోటీల్లో పాల్గొంటున్నాయని, వీటిలో 12 మహిళా జట్లు ఉన్నాయని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.
- **గూడూరు:** ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా గూడూరు మండలంలో నిర్వహించిన షటిల్ పోటీలు శనివారంతో ముగిశాయి. మొదటి రోజు శుక్రవారం 80 టీంలు పోటీ పడగా శనివారం రెండో రోజు 22 టీంలు పోటీ పడ్డాయి. జనవరి 2వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు.

ఓట్ల లెక్కింపు గదులను సిద్ధం చేయండి

కలెక్టర్ రాజాబాబు



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజాబాబు

కోనేరుసెంటర్: రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు వీలుగా ఓట్ల లెక్కింపు గదులను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కృష్ణా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అకడమిక్ బ్లాకును సందర్శించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఏడు శాసనసభ నియోజకవర్గాలు, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కార్యక్రమం విశ్వవిద్యాలయంలో జరుగనుందన్నారు. అందుకోసం అవసరమైన ఓట్ల లెక్కింపు హాళ్లను, స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ పరిశీలించి గదులను ఎంపిక చేశారు. అవసరమైన గదుల్లో మరమ్మతులను వెంటనే చేయించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది, రాజకీయ పార్టీల అభ్యర్థుల ఏజెంట్ల రాకపోకలకు వీలుగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌంటింగ్ హాల్ విశాలంగా ఉండేలా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఓట్లు లెక్కింపు కోసం వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జి. జ్ఞానమణి, డీఆర్‌ఓ పెద్ది రోజా, బందరు ఆర్డీఓ ఎం. వాణి, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం

పేర్ని కిట్టు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాజకీయంగా అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానాన్ని సీఎం వైఎస్ జగన్ కల్పించారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం పెదపట్నంలో శనివారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను పేర్ని కిట్టు ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలులను వివరించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంజూరైన కళ్లజోళ్లను వృద్ధులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, సర్పంచ్ గడిదేశి అనూష, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజీసు, గడిదేశి రాజు పాల్గొన్నారు.

డ్రైయిన్ పనులకు శంకుస్థాపన

మచిలీపట్నంటౌన్: నగరంలోని 45, 3 డివిజన్లలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించనున్న పక్కా డ్రెయిన్ పనులకు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు శంకుస్థాపన చేసి మాట్లాడారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్ ఆకుల వరలక్ష్మి పాల్గొన్నారు.

రజనికి సామాజిక సేవా పురస్కారం ప్రదానం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నానికి చెందిన రాష్ట్ర హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కన్వీనర్, ఉమ్మడి కృష్ణా జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజనికి తెలంగాణకు చెందిన ఇందిర ఫౌండేషన్ నంది అవార్డును బహూకరించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఫౌండేషన్ జాతీయ సాహితీ కళా సేవా ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో రజనికి అవార్డు అందజేశారు. అమ్మిరెడ్డి రజని సామాజిక సేవా రంగంలో చేసిన కృషిని గుర్తించి సామాజిక సేవా పురస్కారం– 2023 ను ఆమెకు అందజేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమెను న్యాయవాదులు విజయ, అయ్యప్ప సత్కరించారు.

అవుట్ పేషెంట్స్ రిజిస్ట్రేషన్ విభాగం ప్రారంభం



మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో పునర్నిర్మించిన అవుట్ పేషెంట్స్ రిజిస్ట్రేషన్ విభాగాన్ని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమారితో కలిసి శనివారం రాత్రి ప్రారంభించారు. పేర్ని నాని మాట్లాడుతూ ఓపీ విభాగాన్ని అధునాతన వసతులతో పునర్నిర్మించారని తెలిపారు. ఆస్పత్రికి రోగుల తాకిడికి అనుగుణంగా ఓపీ చీటీలను వేగంగా అందించేందుకు సిబ్బంది ఓర్పుతో పనిచేయాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జి. రమేష్‌కుమార్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఆర్‌ఎంఓ నిరంజన్‌కుమార్, షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఓటర్లను గుర్తించండి

గూడూరు: మండల పరిధిలో దివ్యాంగ ఓటర్లను గుర్తించాలని తహసీల్దార్ బి. విజయప్రసాద్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

సీఎం జగన్, పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం



మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు అన్నారు. జనవరి నుంచి సామాజిక పింఛన్లు రూ. 3 వేలకు పెంచుతూ సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడంతో నగరంలోని 11వ డివిజన్ పింఛనుదారులు శనివారం సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పింఛనుదారులతో కలిసి నాగరాజు కేక్ కట్ చేశారు.

తెలుగు ప్రజలు ఏకతాటిపై నిలవాలి

ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

అవనిగడ్డ: నీళ్లు, నిధులు, నియామకాల్లో తప్పితే ఉభయ రాష్ట్రాలకు చెందిన తెలుగు ప్రజలు ఏకతాటిపై సమైక్యంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజాకవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వెంకన్న మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో ధన ప్రవాహం మితి మీరిందని, దీనివల్ల విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పన్నాగం విఫలం చేసి, మాతృభాషలను రక్షించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గోరటిని బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు.

బౌద్ధ మ్యూజియం సందర్శన..

ఘంటసాలలోని బౌద్ధారామాన్ని గోరటి వెంకన్న సందర్శించారు. బుద్ధభగవాన్ పవిత్ర హస్తికలతో నిర్మించిన బౌద్ధ స్థూపాన్ని సందర్శించడం మహాభాగ్యమని వెంకన్న అన్నారు. అనంతరం బౌద్ధమ్యూజియంను సందర్శించి చారిత్రక శిల్పాలు, వాటి చరిత్రను తెలుసుకున్నారు. బుద్ధుని చిత్రపటాన్ని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ జీవీ రామకృష్ణ గోరటి వెంకన్నకు అందజేశారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

అవనిగడ్డ: లారీ ప్రమాదంలో మృతిచెందిన పులిగడ్డ పల్లెపాలెంకు చెందిన సింగోతు శివపాములు కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా సొమ్మును వైఎస్సార్‌సీపీ యువనేత సింహాద్రి వికాస్ శనివారం అందజేశారు. శివపాములు ఈనెల 27వ తేదీన జరిగన ప్రమాదంలో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షలు మంజూరుకాగా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును సింగోతు రిషితకు వికాస్ అందించారు.

రహదారుల నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు

చల్లపల్లి: చల్లపల్లి మండలంలో రహదారుల నిర్మాణానికి జిల్లా పరిషత్ నుంచి రూ.27 లక్షలు మంజూరయ్యాయని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి తెలిపారు. శనివారం పాగోలు శివారు మేకావారిపాలెంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నిధులతో పలు ప్రాంతాల్లో రోడ్లను నిర్మించనున్నామని వివరించారు. నిధులు విడుదల చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు ధన్యవాదాలు తెలిపారు.

వరికుప్ప దగ్ధం

కోడూరు: కోడూరు మండలం నక్కవానిదారి గ్రామంలో శుక్రవారం రాత్రి వరి కుప్ప దగ్ధమైంది. నక్కవానిదారి గ్రామానికి చెందిన అప్పికట్ల నారాయణరావు ఐదు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాడు. 15 రోజుల కిందట 4.40 ఎకరాల్లో యంత్రాల సహాయంతో వరికోత కోసి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకున్నాడు. మిలిగిన 60 సెంట్ల పొలంలోకి యంత్రం వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆ పొలంలో పంటను వారం రోజుల కిందట కోత కోసి కుప్పగా వేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు కుప్ప వేసిన వరిపంటకు నిప్పు పెట్టారు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న నారాయణరావు ఘటనాస్థలానికి వెళ్లి చూడగా వరికుప్ప పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.55 వేల నష్టం వాటిల్లింది.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

బంటుమిల్లి: కంచడం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చల్లా విశ్వనాథ్ తయారు చేసిన ఎగ్జిబిట్ సౌత్ ఇండియా స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైందని ఎంఈఓ–1 త్రిపురసుందరీదేవి తెలిపారు. గైడ్ టీచర్ వి. నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో నీటిలో పెంచే మొక్కల ద్వారా వాతావరణ కాలుష్యాన్ని ఎలా నివారించవచ్చు అనే అంశంపై చేసిన ప్రదర్శన మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విశేష ప్రతిభ చూపి సౌత్ ఇండియా స్థాయిలో జరిగే ఎగ్జిబిట్‌కు ఎంపికైందని పేర్కొన్నారు. విద్యార్థి విశ్వనాథ్, గైడ్ టీచర్ నాగమల్లేశ్వరరావును శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఘనంగా సత్కరించి అభినందించారు.

మత్స్య సంపద యోజనపై అవగాహన

కృత్తివెన్ను: మత్స్యకారులు, ఆక్వా రైతుల అభివృద్ధికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్‌బోర్డు అధికారి చలపతిరావు అన్నారు. దీనిపై శనివారం చినగొల్లపాలెంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మత్స్యకారులకు మోపెడ్లు, ఆటోలు, బోట్లు రీప్లేస్‌మెంట్ విధానంలో కొత్తబోట్లు, కేజ్‌కల్చర్ ఇస్తారని వివరించారు.

కలెక్టర్, జేసీని కలిసిన డీసీఎంఎస్ చైర్‌పర్సన్

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌ను శనివారం డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ శనివారం కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌లకు స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐదో రోజుకు చేరిన పైడమ్మ సంబరాలు

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద పైడమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరాయి. భక్తులు పెద్దఎత్తున శిడిబండ్లను కట్టి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మచిలీపట్నం, పెడనకు చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు దాసు వాయునందనరావు, ఆసాది శ్యామ్, కమిటీ సభ్యులు తోట సాంబశివరావు, సుబ్బారావు, ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు, దేవదాయ శాఖ సిబ్బంది పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగాయలంక: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జె.విమలకుమారి మండలంలో శనివారం పర్యటించారు. మొత్తం 22 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బూత్‌లలో సౌకర్యాలను పరిశీలించారు. లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ర్యాంప్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో వసతులు సక్రమంగా ఉన్నాయన్నారు. ఒకటి, రెండు చోట్ల సిబ్బందికి అవసరమైన సూచనలు చేశామని చెప్పారు. వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలోని 106, 107, 108, 109, 110 పోలింగ్ కేంద్రాలను ఈఆర్వో పార్వతి శనివారం పరిశీలించారు విద్యుత్, ర్యాంపులు, డోర్లు, వాటర్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు సూచించారు.

నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన

నాగాయలంక: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై గ్రామ సభలు నాగాయలంక, రేమాలవారిపాలెం గ్రామాల్లో ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సంకల్ప యాత్రపై తొలుత గ్రామస్తులతో ప్రమాణం చేయించారు. పేదలు, అట్టడుగు వర్గాలకు చేయూత, నారీ శక్తికి నూతన ఉత్తేజం, పేదల సంక్షేమమే దేశ సంక్షేమం తదితర అంశాలపై వక్తలు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు, డ్రోన్‌ల సహాయంతో రైతులకు మేలైన లాభదాయక పద్ధతులు, తద్వారా కలిగే విస్తృత ప్రయోజనాలను మండల వ్యవసాయాధికారి అన్నలూరి సంజీవరావు వివరించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర క్యాలెండర్లు, బ్రోచర్లను ఆవిష్కరించారు. సర్పంచి చోడిశెట్టి బుజ్జమ్మ (రేమావారిపాలెం), డాక్టర్ కె.శివరామకృష్ణ, ఏపీఎం కేవై దాసు, గ్రామ కార్యదర్శులు జరుగు పవన్‌కుమార్, రమణ, బండ్రెడ్డి మాణిక్యాలరావు, వైద్య, వ్యవసాయ, ఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.